క్లుప్తంగా

సమయం పాటించాలి



ఆకులనారాయణపల్లెలో విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాశినాయన : ఉపాధ్యాయులు సమయం పాటించాలని ఎంఈఓ నిర్మల అన్నారు. బుధవారం మండలంలోని ఆకులనారాయణపల్లె ఎస్టీ కాలనీ, వరికుంట్ల గోవిందరెడ్డి ఎస్టీ కాలనీలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ రెండు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ చదువుకునే కాలనీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కాలనీ వాసులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు సుధీర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగవేణి

బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.నాగవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు తపాలా సేవలు సక్రమంగా అందేలా చూడటంతోపాటు బద్వేలు పోస్టల్ సబ్ డివిజనల్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఇక్కడ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అహ్మద్‌హుస్సేన్ పదోన్నతిపై నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగవేణి, బదిలీపై వెళుతున్న అహ్మద్‌హుస్సేన్‌లను సబ్ పోస్టుమాస్టర్లు సీ.హెచ్.ధనమ్మ, కె.సుబ్బరాయుడులతోపాటు తపాలా సిబ్బంది, పోస్టల్ ఏజెంట్లు సన్మానించారు.

అర్హులందరికీ 'జగనన్న తోడు' అందాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

కలసపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ 'జగనన్న తోడు' కింద సాయం అందించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో మండల సమాఖ్య మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించాలని, అన్ని సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండే విధంగా చూడాలని తెలిపారు. తీసుకున్న అప్పు ద్వారా జీవనోపాధి పొందే దిశగా ప్రతి సంఘ సభ్యురాలుకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, ఏపీఎం నాయుడు, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



అట్లూరు : మండలంలోని వేములూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రాసంరెడ్డి వెంకటరెడ్డి కుమారుడు వెంకటరెడ్డి వివాహం జరిగింది. ఈ వేడుకకు బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కుమారుడు యువ నాయకుడు ఆదిత్యారెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఏడుగురికి జరిమానా

మైదుకూరు : మైదుకూరు సెకండ్ క్లాస్ కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బుధవారం మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురికి జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ మస్తాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.3,500 వంతున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన నలుగురికి రూ.1000 వంతున స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ టీవీ వరప్రసాద్ జరిమానా విధించినట్లు సీఐ వివరించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి
- సంక్షేమ సారథులు వలంటీర్లే
- ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : మంచి చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోరారు. చంద్రబాబు పాలనలో మేలు జరిగిందా.. సీఎం జగన్ పాలనలో మీకు మేలు జరిగిందా అని ఆలోచించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా రైస్ మిల్లులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై వలెంటీర్ల, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నా పాలనలో మీకు మేలు జరిగింటేనే ఓటువేయాలని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, ప్రజల మీద ఉన్న నమ్మకమే ఆయన మాటలకు నిదర్శనం అన్నారు. జగనన్న సురక్షా కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇంటి వద్దకే పింఛన్ వచ్చేలా చేశారన్నారు. గ్రామాల్లో బడులను బాగుపరిచారన్నారు. సచివాలయాల ద్వారా గ్రామాలకే పాలన తీసుకువచ్చారన్నారు. సీఎం జగన్ ప్రజలకు చెప్పిన దానికంటే అధికంగా మేలు చేశారన్నారు.

చంద్రబాబు చెప్పుకునే సంక్షేమం ఒక్కటీ లేదు: 108 అంటే వైఎస్సార్, ఫీజు రీయింబుర్స్‌మెంట్ అంటే వైఎస్సార్, ఉచిత విద్యుత్ అంటే వైఎస్సార్ పేరు గుర్తుకు వస్తుంది.. ఇలా చంద్రబాబు పేరు చెప్పగానే ఒక్క సంక్షేమం గుర్తుకు రాదని మైదుకూరు నియోజక వర్గ సమన్వయ కర్త శెట్టిపల్లి నాగిరెడ్డి అన్నారు. చంద్రబాబు పేరు చెప్పగానే వెన్నుపోటుకు బ్రాండ్ అంబాజిటర్‌గా గుర్తుకు వస్తుందని అన్నారు. ప్రజలకు మంచి చేసిన నాయకున్ని మనం తిరిగి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా బాషా, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, గంగాధర్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మరళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాప్రసాద వినియోగం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో మహాప్రసాద వినియోగాన్ని ఘనంగా నిర్వహించారు. 11 రోజులుగా జరిగిన విజయదశమి ఉత్సవాలు బుధవారం ముగిశాయి.

శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిమఠం, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో ఈ నెల 15న ప్రథమ అఖండ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో రోజూ ఓ అఖండ స్థాపన చేసి మహార్నవమి నాటికి మొత్తం తొమ్మిది అఖండాలను స్థాపించారు. బుధవారం రెండు మఠాలలో మహాప్రసాద వినియోగం కార్యక్రమం నిర్వహించారు. పెద్దమఠంలో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి, చిన్నమఠంలో జగన్మాత శ్రీ ఈశ్వరీదేవికి మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి ఆయుధపూజ, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. అఖండ ఉద్వాసన పలికి ఉత్సవాలు ముగించారు. కార్యక్రమాల్లో పెద్దమఠం పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగవసంతవెంకటేశ్వర స్వామి కుటుంబ సభ్యులు, ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య, చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, ఈఓ బీవీ జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి



భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేస్తున్న శ్రీవెంకటాద్రిస్వామి

ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్య సేవలు



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ గణేష్ కుమార్

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నీలాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జేసీ పరిశీలించారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు జేసీ సూచించారు. ఈ వైద్య శిబిరంలో 546 మందికి బీపీ, షుగర్, కంటి సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కొంత మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమకుమారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు నందన్, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, డాక్టర్లు వికసిత, దీపక్ రాజ్, శ్యామ్‌కుమార్, సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం



మాట్లాడుతున్న గోసా మనోహర్

ప్రొద్దుటూరు : చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తారని జాతీయ మాలమహానాడు నేషనల్ ప్రెసిడెంట్ గోసా మనోహర్ తెలిపారు. బుధవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఈనెల 28న ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయంతం చేస్తామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళిత, గిరిజనులకు అసైన్‌మెంట్ కమిటీ అనేది వేయకుండా అన్యాయం చేశారన్నారు. పవన్ కళ్యాణ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఫలానా చేస్తానని ఎక్కడా చెప్పలేదని అన్నారు. చంద్రబాబు, పవన్‌లకు బడుబలహీనవర్గాల నాయకులు నచ్చరని తెలిపారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను పైకి తీసుకురావాలని ఇంగ్లీషు మీడియం అమలు చేశారని, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని చెప్పారు. వారి అభివృద్ధికి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు, జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బద్ధశత్రువు అని విమర్శించారు.

పంట కోత ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించాలి



రైతుభరోసా ఛానల్ ప్రాముఖ్యతను వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

బద్వేలు అర్బన్ : పంట కోత ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించాలని, తద్వారా దిగుబడి అంచనా వేయడం సాధ్యమవుతుందని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ పేర్కొన్నారు. బుధవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం అనంతరాజుపురం రైతుభరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రకాల రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం సమీపంలోని పొలాల్లో వరి సాగు చేసిన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్, సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని రైతుభరోసా సహాయకులకు సూచించారు. అలాగే రబీ పంటల సాగు ప్రణాళికపై రైతులతో చర్చించారు. అనంతరం రైతుభరోసా చానల్ ప్రాముఖ్యతను వివరించి రైతులకు సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో రైతుభరోసా సహాయకులు సతీష్‌నాయక్, శిద్దారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్నామని సీపీఐ నాయకుడు శివనారాయణ తెలిపారు. స్థానిక పాతబస్టాండ్‌లో ఉన్న ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం వద్ద బుధవారం ప్రజా రక్షణ భేరి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోకి వచ్చే నెల 1వ తేదీన ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. బద్వేలు, మైదుకూరు, కడప ప్రాంతాల్లో యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, కిరణ్, రాజేంద్ర, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాలరాజుపల్లె, కొండపేట గ్రామా ల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పి.గురివిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

అట్లూరు : మండల పరిధిలోని కామసముద్రం గ్రామానికి చెందిన మద్దిక చిన్నమునిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.15 లక్షల చెక్కును ఎమ్మెల్యే డాక్టరు సుధా అందజేశారు. మద్దిక మహానందరెడ్డి బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగింది. అయితే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ మృతుడికి ఆస్పత్రిలో అయిన ఖర్చు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి కింద 15 లక్షల రూపాయలు మంజూరు చేశారు. సంబంధిత చెక్కును బుధవారం మద్దిక చిన్న మునిరెడ్డికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్డీఏ జిల్లా చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజఓలు సుబ్బారెడ్డి, సర్పంచులు ముడమాల గోవర్ధన్‌రెడ్డి, ఆర్వీ సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ముడమాల జయమ్మ, మండల నాయకులు బోవిళ్ల చిన్న సూరారెడ్డి, పొన్నఓలు బ్రహ్మానందరెడ్డి, పెంచల్‌రెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయంలో తలనీలాలు గురువారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి నరసయ్య, చైర్మన్ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే షామియానాలు, వంటపాత్రలు బాడుగకు ఇచ్చుకొనుటకు వేలం జరుగుతుందని, రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గోపవరం : పంట నమోదు సోషల్ ఆడిట్‌పై గురువారం నుంచి మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన వివిధ పంటలకు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పంట నమోదు తుది జాబితా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించి గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గురువారం బేతాయపల్లె, రాచాయపేట, శుక్రవారం టీ.సంద్రపల్లె, బ్రాహ్మణపల్లె, శనివారం గోపవరం, సోమవారం కాలువపల్లె రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై సాగు చేసిన పంటలు, సర్వే నంబరు వారీగా పరిశీలించుకుని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : జిల్లాలోని బీడి కార్మికులు చదువుకునే తమ పిల్లల ఉపకార వేతనాల కోసం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కమలాపురం బీడి కార్మిక సంక్షేమ ఆసుపత్రి వైద్యాధికారి ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు నవంబర్ 30లోపు, అలాగే ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు డిసెంబర్ 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోండి

దువ్వూరు : మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలంలోని నీలాపురం గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డిపాజిట్లపై అన్ని బ్యాంకులకంటే ఎక్కువ శాతం వడ్డీరేట్లను అందిస్తున్నామన్నారు. తమ బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన లాంటి ఇన్సూరెన్స్ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నాగాంజనేయులు, ప్రతాప్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మైదుకూరు : పోలీసు శాఖ ఆధ్వర్యంలో మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాయ్స్)లో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ టీఎం పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు 'లైంగిక వేధింపుల నుంచి స్త్రీలు, పిల్లలకు రక్షణ – సమాజ పాత్ర' అనే అంశంపై 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. మండలంలోని ప్రతి పాఠశాల, కళాశాల నుంచి వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు విద్యార్థులు హాజరు కావాలని ఆమె కోరారు.

మహిళలపై దౌర్జన్యాలను అరికట్టాలి



ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను సత్కరిస్తున్న గానుగపెంట హనుమంతరావు

కడప కల్చరల్ : విలువలు తరిగిపోతున్న నేటి సమాజంలో మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను కోరారు. బుధవారం ఆయన గుంటూరు రేంజ్ ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ డాక్టర్ భువనగిరి కృష్ణవేణితో కలిసి ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలి తెలుగు రామాయణ రచయిత్రిగా మొల్లమాంబ, ప్రముఖ కవయిత్రిగా తాళ్లపాక తిమ్మక్క తదితరులు జిల్లాకు గొప్ప పేరు తెచ్చి పెట్టారన్నారు. అలాంటి జిల్లాలో మహిళలపై దౌర్జన్యాలు పెరగడం బాధాకరమని, మీదైనా శైలిలో వాటిని అరికట్టాలని కోరారు. అనంతరం వారు ఎస్పీని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.


సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో దాదాపు 60 మంది ఉపాధ్యాయులకు పొసిషన్ ఐడీ రాక టెక్నికల్ సమస్యతో మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్సీ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు రాముడు, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు సీఎం వైఎస్ జగన్



మాట్లాడుతున్న బాదుల్లా

కడప రూరల్ : సామాజిక విప్లవకారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెండ్ ఆర్గనైజేషన్ (ఎంబీసీడీఓ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా అన్నారు. బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతును తెలిపారు. అనంతరం బాదుల్లా మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో సామాజిక విప్లవం తీసుకొచ్చారని అన్నారు. 2019 కేబినెట్‌లో 25 మంత్రి పదవులకు 14 మంత్రి పదవులు, నలుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించారన్నారు. అలాగే బీసీ వర్గాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్, డైరెక్టర్‌లను నియమించారని తెలిపారు. దేశ చరిత్రలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారన్నారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ నుంచి చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు తాము సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్ని వర్గాల వారు ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు.

వైభవం.. పుష్పయాగం

ముగిసిన దసరా ఉత్సవాలు

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు కడపలోని అమ్మవార్ల ఆలయాల్లో రోజుకో అలంకారం చొప్పున ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ప్రధానమైన రోజుల్లో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. దుర్గాష్టమి, విజయదశమితో ప్రధాన కార్యక్రమాలు పూర్తి కాగా, మంగళ, బుధ వారాల్లో పవళింపుసేవ, పుష్పయాగం నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునగా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పవళింపు సేవ, పుష్పయాగం నిర్వహించారు. భక్తులందరూ తమకు తోచిన పూలు, సుగంధ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. ఎలిశెట్టి శివకుమార్ ప్రత్యేకంగా బెంగళూరు నుంచి 75 రకాల పుష్పాలను తెప్పించారు. 450 కిలోల పుష్పాలు, 200 కిలోల మరువం, దవనం లాంటి పరిమళ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. అర్చక బృందం వాటిని అమ్మవారికి క్రమ పద్ధతిలో అమర్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నిరకాల దోషాల పరిహారం కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పుష్పయాగాన్ని భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేకంగా ఊయల ఏర్పాటు చేసి సర్వాలంకార భూషితురాలైన అమ్మవారికి పవళింపు సేవ నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు రెండు వేల మందికి అమ్మవారి పేరిట అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



పూలను తీసుకొస్తున్న భక్తులు